క్లుప్తంగా

గాలిపటాల పంపిణీ



పెనమలూరు: యనమలకుదురులో సంక్రాంతి పండగ సందర్భంగా మండల ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో ఆదివారం గాలిపటాలు పంపిణీ చేశారు. గ్రామంలో కొండవెనుక సాయి బాబా మందిరం వద్ద సంఘ సభ్యుడు కొత్త నాగరాజు కార్యక్రమాన్ని ప్రారంభించారు. చిన్నారులకు 600 గాలిపటాలు పంపిణీ చేశారు. బిస్కెట్లు, చాక్లెట్లు అందజేశారు. కార్యక్రమంలో సభ్యులు రాచూరి ఆంజనేయులు, తటపర్తి సతీష్, చిట్టూరి నాగబాబు, కొప్పవరపు శ్రీనివాసులు, కోటేశ్వరరావు, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

చినకంచిలో గోపూజ



నున్న(విజయవాడరూరల్): కనుమ పండగ సందర్భంగా నున్న చినకంచిలోని గోశాలలో గోవులకు సంప్రదాయబద్ధంగా గోపూజ నిర్వహించారు. కనుమ పండగ రోజు పశువులకు ప్రత్యేకించి పూజలు చేయడం ఆనవాయితీ అని చినకంచి దేవస్థానం ట్రస్టీ మొక్కపాటి శర్మ తెలియజేశారు. గోవులకు పూజ చేసి కొమ్ములకు తెల్ల రంగులు వేశారు. కార్యక్రమంలో ట్రస్టీ శర్మ, నాగిరెడ్డి, అర్చకులు పాల్గొన్నారు.

నున్నలో గ్రామోత్సవం



నున్న(విజయవాడరూరల్): ఉత్తరాయణ పుణ్యకాలం ప్రారంభం కావడంతో గ్రామంలోని దేవుళ్ల గ్రామోత్సవం నిర్వహించారు. శ్రీకాశీఅన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి, గంగా పార్వతీ సమేత శ్రీరామలింగేశ్వరస్వామి, రుక్మిణి సత్యభామ సమేత శ్రీవేణుగోపాలస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

అనాథాశ్రమంలో అన్నదానం



గన్నవరం: అనాథ పిల్లలు, వృద్ధులకు సేవ చేయడం అదృష్టంగా భావించాలని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు కేవీ రమణ పేర్కొన్నారు. స్థానిక అమ్మ చిల్డ్రన్ హోంలో సోమవారం సంక్రాంతి కనుమ పండగ సందర్భంగా అనాథ పిల్లలకు, వృద్ధులకు అన్నదానం చేశారు. రమణ మాట్లాడుతూ.. పండగను ఆశ్రమంలో జరుపుకోవడం ఆనందంగా ఉందన్నారు. సేవా భావంతో నడిచే ఇటువంటి స్వచ్ఛంద సంస్థలకు తన సహకారం ఉంటుందన్నారు. కార్యక్రమంలో కడియాల హనుమంతరావు, నల్లమోతు రమేష్, శివ, నిడమర్తి బుజ్జిరావు, ఆశ్రమ నిర్వాహకురాలు కానూరి శేషుమాధవి తదితరులు పాల్గొన్నారు.

హేతువాద సాహిత్యం విస్తృతం కావాలి

విజయవాడ కల్చరల్: హేతువాద సాహిత్యం విస్తృతం కావాలని ప్రజా సాహితి సంస్థ అధ్యక్షుడు దివికుమార్ అన్నారు. త్రిపురనేని స్మారక సంస్థ, అభ్యుదయ సంఘాల ఆధ్వర్యాన తుమ్మలపల్లి కళాక్షేత్రంలో కవి, పరిశోధకుడు బహుభాషా వేత్త త్రిపురనేని రామస్వామి చౌదరి జయంతి, వర్ధంతి కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. దివికుమార్ మాట్లాడుతూ మహిళలోని ఎదుగుదలను స్వాగతించాల్సిన అవసరముందన్నారు. సమాజంలోని మూఢాచారాలను ఖండించాలని సూచించారు. శ్రీశ్రీ సాహిత్యనిధి వ్యవస్థాపకుడు సింగంశెట్టి అశోక్ కుమార్ మాట్లాడుతూ కవిగా ఆయన సమాజాన్ని ప్రభావిత పరిచే రచనలు చేశారన్నారు. తెనాలి మున్సిపల్ చైర్మన్‌గా, న్యాయవాదిగా ప్రజలకు సేవలు అందించినట్లు తెలిపారు. హేతువాది పెన్మత్స సుబ్బరాజు సంకలన పరచిన వ్యాస సంపుటి మానవ వాద మార్గం గ్రంథాన్ని అతిథులు ఆవిష్కరించారు. వివిధ సాహిత్య సంస్థల ప్రతినిధులు ఎం.అరుణ్ కుమార్, గోళ్ల నారాయణరావు, జంపాల కృష్ణ కిషోర్, పూర్ణెందు చంద్రమౌళి, మందగళ్ల సాయికుమార్ తదితరులు పాల్గొన్నారు.

సంతోషంగా సంక్రాంతి



యనమలకుదురులో జరిగిన సంక్రాంతి పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తున్న ఎస్‌ఐ అర్జున్‌రాజు



చిక్కవరంలో సూర్యనారాయణ స్వామి ఆలయంలో..

- సంప్రదాయ క్రీడలతో సందడి
- పితృదేవతలకు పూజలు



ఉయ్యూరులో పితృదేవతలకు పూజలు చేసి దానం చేస్తున్న దృశ్యం



అల్లాపురంలో..

ఉయ్యూరు: సంక్రాంతి వేడుకలను అంతటా సంతోషంగా జరుపుకున్నారు. పల్లెలు అన్నీ పండగ శోభతో కళకళలాడాయి. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో సంప్రదాయబద్ధంగా పండగ జరుపుకున్నారు. ఉయ్యూరు, మండలంలోని వివిధ గ్రామాల్లో సంక్రాంతి పర్వదినమైన ఆదివారం సంప్రదాయాలను ప్రతిబింబిస్తూ ఆటపాటలు, కోడి పందేలతో సందడి చేశారు. ఆలయాల్లో గోదాదేవి కల్యాణాన్ని కనులారా తిలకించి భక్తిపారవశ్యం చెందారు. కనుమ రోజు సోమవారం పితృదేవతలను స్మరిస్తూ పూజలు చేశారు. నూతన వస్త్రాలను పూజలో ఉంచి పెద్దల ఆశీర్వాదం తీసుకున్నారు. బోళ్లపాడు, ఆకునూరు, పెద ఓగిరాల, గండిగుంట గ్రామాల్లో సంప్రదాయ క్రీడలు నిర్వహించారు.

సంక్రాంతి క్రీడల్లో యువత పాల్గొనాలి

పెనమలూరు: సంక్రాంతి పండగ సందర్భంగా యువత ఆటల పోటీల్లో పాల్గొని సందడిగా చేయాలని పెనమలూరు ఎస్‌ఐ అర్జున్‌రాజు అన్నారు. యనమలకుదురులో డీవైఎఫ్‌ఐ, ఎస్‌ఎఫ్‌ఐ, ఐద్వా, ప్రజానాట్య మండలి ఆధ్వర్యాన సంక్రాంతి సంబరాల్లో యువత, మహిళలకు ఆటల పోటీలు నిర్వహించారు. ఆదివారం రాత్రి జరిగిన బహుమతీ ప్రదానంలో ఎస్‌ఐ అర్జున్‌రాజు మాట్లాడుతూ యువత చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచించారు. యువత సరైన మార్గంలో పయనించడానికి యువజన సంఘాలు చేస్తున్న కృషిని అభినందించారు. ఈ సందర్భంగా ముగ్గులు, సంక్రాంతి పాటలు, ప్రాచీన సాంప్రదాయ కళా ప్రదర్శనలు చేశారు. యువజన సంఘాల నేతలు పాల్గొన్నారు.

పెనమలూరు: సంక్రాంతి సందర్భంగా మండలంలోని యనమలకుదురు, చోడవరం, పెనమలూరు, పోరంకిలో సంప్రదాయ కోడిపందేలు జరిగాయి.

గన్నవరం రూరల్: మకర సంక్రాంతి వేడుకలను ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. సూర్యుడు మకర రాశిలోకి ప్రవేశించిన సందర్భంగా చిక్కవరం శ్రీక్షేత్ర హనుమత్‌పురంలో శ్రీ సూర్యనారాయణ స్వామికి అన్నపుటోత్సవం నిర్వహించారు. పులిహోర, చక్రపొంగలి రాశులుగా పోసి, ఈ కాలంలో లభించే పండ్లు, కూరగాయలు, పూలు మొత్తం 30 రకాలను స్వామివారికి నివేదించారు. ప్రకృతిలో లభించే ఆహారమంతా సూర్యుడి ప్రసాదమేనని వేద పండితులు చెప్పారు. అనంతరం శ్రీ ఉషాపద్మిని సమేత సూర్యనారాయణ స్వామికి సూర్యప్రభ వాహనంపై గ్రామోత్సవం నిర్వహించారు. అన్నపుటోత్సవం ప్రసాదాన్ని భక్తులకు పంచారు. ఆలయ నిర్వాహకులు వంశీ ఆధ్వర్యంలో కార్యక్రమాలు జరిగాయి. కనుమ పండగ పురస్కరించుకుని సోమవారం పశువులకు పూజలు చేశారు.

అల్లాపురం(గన్నవరం): మండలంలోని అల్లాపురంలో సంక్రాంతి పండగను పురస్కరించుకుని సోమవారం సత్యప్రసాద్ మెమోరియల్ సౌజన్యంతో విద్యార్థి, యువజన, మహిళా సంఘం ఆధ్వర్యంలో ముగ్గుల పోటీలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో హాజరైన మహిళలు, బాలికలు సంక్రాంతి రంగవల్లికలను తీర్చిదిద్దారు. అనంతరం మ్యూజికల్ చైర్స్, లెమన్ అండ్ స్పూన్, తాడు లాగుడు, స్లో సైక్లింగ్ తదితర ఆటల పోటీలను నిర్వహించారు. అనంతరం విజేతలకు దాత దారుణ కిరణ్‌కుమార్, ఐద్వా నాయకురాలు మల్లంపల్లి జయమ్మ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సంక్రాంతి పండుగ రోజున సంప్రదాయ క్రీడలు, ముగ్గుల పోటీలు నిర్వహించడం అభినందనీయమని జయమ్మ పేర్కొన్నారు. గ్రామ ప్రముఖులు ఆవుటపల్లి సాంబయ్య, ఆవుటపల్లి సుబ్బారావు, మొగల్ ఖాసీంపేరా, బడుగు బాబూరావు, బండారు లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

‘వందేభారత్’కు జంక్షన్‌లో స్వాగతం



స్థానిక రైల్వేస్టేషన్‌లో ఆగిన వందేభారత్ రైలు

హనుమాన్‌జంక్షన్ రూరల్: వందేభారత్ సికింద్రాబాద్-విశాఖపట్టణం నూతన రైలుకు హనుమాన్ జంక్షన్‌లోని రైల్వేస్టేషన్‌లో ఆదివారం సాయంత్రం ఘనంగా స్వాగతం పలికారు. వందేభారత్ లోకో పైలట్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించారు. వందేభారత్ ఎక్స్‌ప్రెస్ రైలును చూసేందుకు స్థానికులు అధిక సంఖ్యలో రైల్వేస్టేషన్‌కు తరలివచ్చారు. ట్రయల్‌రన్ భాగంగా ఇక్కడి రైల్వేస్టేషన్‌లో నిముషం పాటు నిలిపారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ రాజాబాబు, మండల అధ్యక్ష, కార్యదర్శులు తోట మురళీధర్, ముత్తిరెడ్డి పిచ్చేశ్వరరావు, కిసాన్ మోర్చా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిరువోలు బుచ్చిరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి పంతం గజేంద్రరావు, జనసేన మండల అధ్యక్షుడు వడ్డి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

ఫ్యామిలీ ఫొటోలతో నూతన సంవత్సర క్యాలెండర్లు



ఫొటోలతో క్యాలెండర్లు అందజేస్తున్న సర్వీస్ స్టేషన్ మేనేజర్ వెంకటప్పయ్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): సంక్రాంతి పర్వదినాన్ని పురస్కరించుకుని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ అధీకృత సంస్థ పైలట్ సర్వీస్ స్టేషన్ వినూత్న కార్యక్రమం చేపట్టింది. వినియోగదారుల కుటుంబ సభ్యుల ఫొటోలతో నూతన సంవత్సర క్యాలెండర్‌ను రూపొందించింది. ఫొటో దిగిన వెంటనే వినియోగదారులకు క్యాలెండర్‌ను ఉచితంగా అందజేశారు. ఈ సంక్రాంతికి సుమారు 600 మంది వినియోగదారులకు తమ కుటుంబ సభ్యుల ఫొటోలతో కూడిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను అందజేసినట్లు మేనేజర్ వెంకటప్పయ్య తెలిపారు. ఏడాది పొడవునా పలు శుభ సందర్భాలను పురస్కరించుకుని వినియోగదారులకు విశేష సేవలు అందిస్తోన్నట్లు ఆయన తెలిపారు. బందరు రోడ్డులోని ఇండియన్ ఆయిల్ సర్వీస్ స్టేషన్ వద్ద జరిగిన ఈ కార్యక్రమంలో మహిళలు, పిల్లలు పాల్గొని ఎంతో ఉత్సాహంగా ఫొటోలు దిగారు. తమ కుటుంబ సభ్యులతో కూడిన నూతన సంవత్సర క్యాలెండర్లను చూసుకుని మురిసిపోయారు. పండగ సందర్భంగా పిల్లలకు స్వీట్స్, గాలిపటాలను యాజమాన్యం అందజేసింది. కార్యక్రమంలో సంస్థ అధిపతి ఎంవీవీ సత్యనారాయణ, ఐ.ఓ.సి.ఎల్. చీఫ్ డివిజనల్ రిటైల్ హెడ్ నరేంద్రమౌర్య, అనిల్, ఎస్‌టీఆర్ జిల్లా సేల్స్ ఆఫీసర్ కె.వరప్రసాద్, నందకిషోర్ పాల్గొన్నారు.

ఘనంగా అంకమ్మతల్లి శక్తిపీఠం వార్షికోత్సవం



అంకమ్మతల్లి పల్లకీ సేవలో భక్తులు

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ నేతాజీకాలనీలోని శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో వార్షికోత్సవ వేడుకలు ఘనంగా జరిగాయి. అమ్మవారికి ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. ఆదివారం సాయంత్రం జ్యోతులతో పల్లకీ సేవ, తెప్పోత్సవం జరిగింది. అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకుని భక్తిశ్రద్ధలతో పూజలు చేసి తీర్థప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించిన వాహనంలో ఉంచి మధురానగర్ పురవీధుల్లో మేళతాళాలు, డప్పువాయిద్యాలతో నగరోత్సవం నిర్వహించారు. దారి పొడవునా మహిళలు హారతులు ఇస్తూ, పసుపునీళ్లుపోసి స్వాగతం పలికారు. కార్యక్రమాలను పీఠం వ్యవస్థాపకులు అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు.

పండగ కళ



సంక్రాంతి సెలవుల నేపథ్యంలో నగరంలోని రాజీవ్‌గాంధీ పార్క్ చిన్నారులతోపాటు వారి కుటుంబ సభ్యులతో కళకళలాడింది. ఆది, సోమవారాల్లో నగర వాసులు అధిక సంఖ్యలో పార్క్‌కు తరలి వచ్చారు. చిన్నా, పెద్దా అని తేడా లేకుండా అందరూ ఆటలు ఆడుతూ సంతోషంగా గడిపారు. పండగ సందడి అంతా పార్క్‌లోనే కనిపించింది.

-సాక్షి ఫొటోగ్రాఫర్, విజయవాడ

వృద్ధులను ఆదరించడం సామాజిక బాధ్యత



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న చారిటబుల్ ట్రస్ట్ సభ్యులు

(విజయవాడసెంట్రల్): వృద్ధులను ఆదరించడం సామాజిక బాధ్యతగా గుర్తించాలని నేషనల్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ వేముల భాను ప్రకాష్ అన్నారు. స్థానిక దుర్గాపురం విజయ్ నర్సింగ్ స్కూల్లో ఆదివారం వయోవృద్ధ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో దాత డాక్టర్ ఎం.గురుమూర్తి, డాక్టర్ ఎంవీఎం లక్ష్మి సహకారంతో వయోవృద్ధులకు నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమం జరిగింది. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. గత 187 నెలలుగా వయోవృద్ధులకు నాణ్యమైన నిత్యావసర సరుకులు అందజేయడంతో పాటు ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు అందజేయడం అభినందనీయం అన్నారు. అసోసియేషన్ సావనీర్ కమిటీ చైర్మన్ డాక్టర్ వీఎస్ సూర్యకుమార్ పమ్మి, జిల్లా అధ్యక్షుడు డాక్టర్ గుడిపూడి చిన రాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ వీ రత్న ప్రియదర్శిని, మాట్లాడారు. ట్రస్ట్ చైర్మన్ డాక్టర్ చల్లా హరికుమార్, వైస్ చైర్మన్ తేజ్‌రాజ్ సోలంకి మాట్లాడుతూ ట్రస్ట్ సభ్యులు, దాతల సహకారంతో వృద్ధులకు సేవలు అందిస్తున్నామన్నారు. అనంతరం ఉచితంగా వైద్యపరీక్షలు నిర్వహించి మందులు, నిత్యావసర సరుకులు అందజేశారు. కార్యక్రమంలో ట్రస్టీ తట్టి అర్జునరావు, నాయకులు ఎస్.భాస్కర్‌యాదవ్ పాల్గొన్నారు.

ముగిసిన వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నీ



బహుమతీ ప్రదానం చేస్తున్న ఎమ్మెల్యే వెలంపల్లి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ నాకౌట్ టోర్నమెంట్ విజయవంతంగా ముగిసింది. విద్యాధరపురం 39వ డివిజన్ పరిధిలోని షాదీఖానా మైదానంలో సంక్రాంతి సందర్భంగా వెలంపల్లి యూత్ ఆధ్వర్యంలో వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ నాకౌట్ టోర్నమెంట్ నిర్వహించారు. ఈ నెల 10న ప్రారంభమైన టోర్నమెంట్ సంక్రాంతి రోజున ముగిసింది. ఈ పోటీల్లో 32 జట్లు పాల్గొనగా ఈశ్వర్ సీసీ, సత్తార్ సీసీ జట్లు ప్రథమ, ద్వితీయ బహుమతులు గెలుచుకున్నాయి. మొదటి బహుమతిగా రూ.20వేలు, ద్వితీయ బహుమతిగా రూ.15వేలు నిర్ణయించారు. విజయవాడ పశ్చిమ ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి పర్వదినం సందర్భంగా వైఎస్సార్ మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వహించడం సంతోషదాయకమన్నారు. ప్రతి ఏటా సంక్రాతికి ఈ పోటీలు నిర్వహించాలని సూచించారు. కార్యక్రమంలో 39వ డివిజన్ కార్పొరేటర్ గుడివాడ నరేంద్ర, ఆర్గనైజర్స్ డీవీ రెడ్డి, శ్రీకాంత్, ప్రభాకర్, కేసరి సుబ్బారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మన సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించుకోవాలని శ్రీవేద గ్రూప్ అధినేతొంకటేష్ అన్నారు. స్థానిక మధురానగర్ నేతాజీ కాలనీ శ్రీ అంకమ్మతల్లి శక్తిపీఠంలో సోమవారం రాత్రి సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ముఖ్య అతిథిగా వెంకటేష్ పాల్గొని సంకాంత్రి సంబరాలలో నిర్వహించిన పోటీల్లో విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. తొలుత మహిళలకు నిర్వహించిన ముగ్గుల పోటీలలో మహిళలు ఉత్సాహంగా పాల్గొని వారిలోని సృజనాత్మకత ఉట్టిపడేలా రంగవల్లులను తీర్చిదిద్దారు. చిన్నారులు ప్రదర్శించిన సాంస్కృతిక ప్రదర్శనలు ఆహూతులను అలరించాయి. కార్యక్రమాలను అన్నాబత్తుల శరాబందీరావు పర్యవేక్షించారు.



చిన్నారుల ప్రదర్శనలు



చిన్నారులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు

25మందిపై కేసులు

పెనమలూరు: సంక్రాంతి పండగ సందర్భంగా కోడి పందేలు, పేకాడుతున్న 25 మందిపై సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం యనమలకుదురు, చోడవరం, పెనమలూరు, పోరంకి ప్రాంతాల్లో కోడి పందేలు, పేకాడుతున్న 25 మందిపై పోలీసులు దాడులు చేసి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద పలు కోళ్లు, నగదు స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి అరెస్టు చేశారు.

ద్విచక్ర వాహన చోదకుడికి గాయాలు

పెనమలూరు: పోరంకి సెంటర్‌లో బందరురోడ్డుపై జరిగిన ప్రమాదంలో వ్యక్తికి గాయాలు కావడంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పెనమలూరు మసీదు సెంటర్‌కు చెందిన చిటికల సుబ్రహ్మణ్యం కారు డ్రైవర్. అతను తన ద్విచక్రవాహనంపై విజయవాడ నుంచి పెనమలూరుకు వెళ్తుండగా పోరంకి సెంటర్‌లో కారు అతన్ని ఢీ కొట్టింది. ఘటనలో అతని కాలు విరిగింది. బాధితుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

మరో ఘటనలో..

పెనమలూరు: చోడవరం వద్ద కరకట్టపై జరిగిన రోడ్డు ప్రమాదంలో భార్యాభర్తలు గాయపడటంతో పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం చోడవరం గ్రామానికి చెందిన పి.ఏసు అతని భార్య దివ్యభవాని బైక్‌పై చోడవరం నుంచి విజయవాడకు బయలుదేరారు. వారు కరకట్టపై ప్రయాణిస్తుండగా గ్రామ సమీపంలో విజయవాడ నుంచి అవనిగడ్డకు వెళ్తున్న కారు ఎదురుగా వచ్చి ఢీ కొట్టింది. ఘటనలో భార్యాభర్తకు గాయాలయ్యాయి. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

చికిత్స పొందుతూ కార్మికుడి మృతి

కృష్ణలంక(విజయవాడతూర్పు): ఆటో ఢీకొనడంతో గాయాలపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న పారిశుద్ధ్య కార్మికుడు సోమవారం మృతిచెందాడు. ఈ ఘటన కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు గిరిపురానికి చెందిన బంగారు గణేష్(43) అనే పారిశుద్ధ్య కార్మికుడు ఈ నెల 11వ తేదీన ఉదయం పశువుల ఆస్పత్రి సమీపంలో నేతాజీ వంతెనపై విధి నిర్వహణలో ఉన్నాడు. ఆ సమయంలో బందరురోడ్డు నుంచి జాతీయ రహదారి వైపు వెళ్తున్న ఒక ఆటో ఆ కార్మికుడిని ఢీకొట్టింది. గాయాలపాలైన అతడ్ని సమీపంలోని వారు చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అప్పటినుంచి ఆస్పత్రిలో చికిత్స పొందుతూ సోమవారం ఉదయం మృతిచెందాడు. మృతుడి భార్య నీలిమ ఇచ్చిన ఫిర్యాదుపై పోలీసులు కేసు నమోదు చేశారు.

హోటల్ నిర్వాహకుడు అదృశ్యంపై కేసు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): హోటల్ నిర్వాహకుడు అదృశ్యమైన ఘటనపై భవానీపురం పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల కథనం మేరకు భవానీపురం ఔట్ ఏజెన్సీకి చెందిన నిడమానూరి శ్రీనివాస్ కుమ్మరిపాలెం సెంటర్‌లో భోజన హోటల్ నిర్వహిస్తున్నాడు. ఈ నెల 12వ తేదీ ఉదయం 10 గంటల సమయంలో హోటల్ నుంచి ఇంటికి వచ్చిన శ్రీనివాస్ మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఆ తర్వాత అతను ఇంటికి తిరిగి రాలేదు. శ్రీనివాస్ ఇంటికి తిరిగి రాకపోవడంతో అతని భార్య దుర్గ చుట్టుపక్కల వారిని, బంధువులు, స్నేహితులను ఆరా తీసినప్పటికీ జాడ తెలియలేదు. దీంతో తన భర్త కనిపించడం లేదంటూ భవానీపురం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. 11వ తేదీ భోజనం ఆర్డర్ విషయంలో హోటల్ వద్ద కొందరు వ్యక్తులు తన భర్తతో గొడవ పడినట్లు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

అరిసెల పంపిణీ

మధురానగర్(విజయవాడసెంట్రల్): సంక్రాంతి పర్వదినం పురస్కరించుకుని జయహో వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుడమేరు వంతెన సెంటర్‌లో పులిహోర, అరిసెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షురాలు కొల్లా జయశ్రీ మాట్లాడుతూ మన సంస్కృతి, సంప్రదాయలకు ప్రతీకగా పండగలను ఘనంగా జరుపుకోవాలన్నారు. పండగ పూట ప్రతిఒక్కరూ పిండివంటలు చేసుకోలేరని కావున తాము సామాజిక బాధ్యతగా పులిహోర, అరిసెలను పంణీ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో క్లబ్ సభ్యుడు బీ ఆంజనేయరాజు పాల్గొన్నారు.

పేదలకు అన్నదానం

ముత్యాలంపాడుకు చెందిన హెల్పింగ్ టుగెదర్ 2099 గ్రూప్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సంక్రాంతి పండగ సందర్భంగా అన్నదానం చేశారు.